30072024-DIS-04_Layout 1 7/30/2024 3:58 AM Page 1

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

కాళేశ్వరంపై కాంగ్రెస్ కుప్పిగుంతులు

ప్రపంచ ప్రసిద్ధి పొందిన కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుపై కాంగ్రెస్ వేస్తున్న కుప్పిగంతులు చూస్తే చెరపకురా చెడేవు అని పెద్దలు ఎందుకు హితవు చెప్పారో అర్థమవుతుంది. నీరు పల్లమెరుగు అనే నైసర్గిక సూత్రాన్ని తిరగరాసి గోదావరి గంగను కొండలెక్కించిన మహత్తరమైన కాళేశ్వరం ఓ మానవ నిర్మిత అద్భుతంగా మన్ననలు అందుకున్నది. ఈ ప్రాజెక్టు సూత్రధారిగా తెలంగాణ మొదటి ముఖ్యమంత్రి కేసీఆర్ కీర్తిప్రతిష్ఠలు నలుదిక్కులా వ్యాపించాయి. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలకులకు ఇది మింగుడు పడటం లేదు. దాంతో కాళేశ్వరానికి కళంకం అంటగట్టే పనిలో పడ్డారు. కేసీఆర్‌పై బురదజల్లే ప్రయత్నంలో భాగంగా ప్రజాప్రయోజనాలనూ బలి పెట్టేందుకూ సిద్ధమయ్యారు. సుదీర్ఘకాలం దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించిన చరిత్ర గల కాంగ్రెస్‌కు రాష్ట్రాలు, దేశం కన్నా రాజకీయాలే ముఖ్యం. అందరి ప్రయోజనాల కన్నా అధికారమే పరమావధి. అందుకు ఎంతకైనా తెగించేందుకు సిద్ధపడ్డారు. అంతిమంగా భంగపడ్డారు. క్లుప్తంగా ఇదీ కాళేశ్వరంలో కాంగ్రెస్ పితలాటకం కథ.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సుదీర్ఘకాలం కాంగ్రెస్ పాలనలోనే గడిచినా కూడా పంట పొలాలకు, నీళ్ల లేకపోవడం, సాగుకు సరైన సాకర్యాలు అందుబాటులోకి రాకపోవడం అనేది సిగ్గచేటైన సంగతి. ఇందుకు ఆ పార్టీ బాధ్యత వహించాలి. ఈ నేరంలో మొదటి ముద్దాయి కాంగ్రెస్ పార్టీయేననేది ప్రత్యక్ష సత్యం. ప్రజలకు ప్రత్యక్ష అనుభవం. బంగారం పండే సారవంతమైన నేలలు, ఆరుగాలం కష్టించి పనిచేసే రైతాంగం కలిగిన గడ్డ మీద ప్రతి అంగుళం పంటభూమికి నీళ్లివ్వాల్సిన కాంగ్రెస్ తాను ఇవ్వకపోగా.. ఇచ్చిన కేసీఆర్‌ను దోషిగా నిలబెట్టేందుకు తంటాలు పడుతుండటం విడ్డూరం. ఈ వితండవాదాన్ని ప్రకృతే ఎండగట్టింది. ప్రజల ముందు కాంగ్రెస్‌నే దోషిగా నిలబెట్టింది. కాళేశ్వరంపై ఖర్చు చేసిన లక్ష కోట్లు వృథా అని, అందులో నీళ్లకు బదులుగా అవినీతి ప్రవహించిందని కొంతకాలంగా దుష్ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ప్రజలను నమ్మించజూసింది. అదంతా కూలగొట్టి వేరే ఏదో కట్టాలని నానా హంగామా చేసింది. అత్త మీద కోపం దుత్త మీద చూపినట్టుగా కేసీఆర్ మీది అక్కసు కాళేశ్వరంపై చూపాలని ఉరుకులాడింది. కానీ, చివరికి ఇరికి ఇగిలించాల్సి వచ్చింది.

అసలు కాంగ్రెస్ చేసిందేమిటి? అనాలోచితంగా ఎస్సారెస్పీ కట్టింది. ఎగువన మహారాష్ట్రలో కట్టిన ప్రాజెక్టులతో అది వట్టిపోయింది. పెట్టిన ఖర్చు వృథా అయిపోయింది. పైగా ఆ దిగువనే ఎల్లంపల్లి తలపెట్టింది. దాన్ని పూర్తి కూడా చేయలేదు. నీళ్ల లేకుండా కాంట్రాక్టర్ల కమీషన్ల కోసం ఎన్ని ప్రాజెక్టులు కడితే ఏమి ప్రయోజనం? అన్నీ కూడా ఇసుకలో కట్టిన పిచ్చుక గూళ్లుగా తయారయ్యాయి. పిచ్చిమొక్కలు మొలిచిన ప్రాజెక్టులకు మళ్లీ జలకళ తెచ్చేందుకు కేసీఆర్ మేధోమథనం చేశారు. ఓ ఉపనదిని వినియోగించుకొని ఈ వ్యవస్థకు తిరిగి ప్రాణం పోసేందుకు జరిగిన అపూర్వ భగీరథ ప్రయత్నమే కాళేశ్వరం. ఉపనది ప్రాణహిత సాయంతో జీవనది గోదావరికి వైభవోజ్వల స్థితిని సమకూర్చేందుకు చేసిన తపస్సు ఫలమే కాళేశ్వరం. కరువు రోజుల్లో కడుపు నింపే కల్పతరువు లాంటి ప్రాజెక్టు ఇది. ప్రధాన నదిలో నీళ్లు ఇంకిపోయినప్పుడు ఉపనది నీటితో మళ్లీ బతికించడమే దీని వెనుకనున్న మహత్తరమైన జలసూత్రం. గతంలో ఎస్సారెస్పీ నుంచి నీళ్లందని తెలంగాణ జిల్లాలకు, అలాగే మంజీర వంటి ఉపనదుల మీద నిర్మించిన సింగూరు వంటి ప్రాజెక్టులకు పుష్కలంగా నీళ్లు సమకూర్చడమే కాళేశ్వరం లక్ష్యం. కానీ కక్షతో ఈ ప్రాజెక్టును పడావు పెట్టేందుకు సమకట్టింది కాంగ్రెస్. చిన్న చిన్న సమస్యలను భూతద్దంలో చూపి కాళేశ్వరం పనైపోయిపోయిందని గావుకేకలు పెట్టింది. కుటిల బుద్ధితో, ప్రజాప్రయోజనాలకు విరుద్ధంగా కాళేశ్వరం విధ్వంసాన్ని కోరుకున్నది. ఉద్దేశపూర్వకంగా నీళ్లు ఎత్తిపోయకుండా నయవంచనతో తాత్సారం చేసింది. కానీ ప్రకృతి ఎదురు తిరిగింది. కాంగ్రెస్‌కు కర్రుగాల్చి వాతపెట్టింది. నీళ్లు లేక పొలాలు వెలవెలపోయాయి. చెరువులు నెర్రెలు బారాయి. రైతాంగం విలవిలలాడింది. కాళేశ్వరం పంపింగ్ చేయక తప్పని పరిస్థితి వచ్చిపడింది.

రాజకీయ స్వార్థం కోసం ప్రజలను, ప్రాజెక్టులను బలిచేయొద్దని, అట్లా చేస్తే ప్రజాదండుతో కదిలివచ్చి తామే కార్యరంగంలోకి దూకుతామని కేసీఆర్ ముందే హెచ్చరించారు. నీళ్ల మోటర్లు ఆన్ చేయకపోతే 50 వేల మంది రైతులతో వచ్చి మేమే మోటర్లు నడిపిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాఖీదు ఇచ్చారు. కొరడా ఝుళిపిస్తే కాంగ్రెస్ సర్కారు దిగివచ్చింది. అన్నీ దిగమింగుకొని కిక్కురుమనకుండా నీటిని ఎత్తిపోసేందుకు సిద్ధమైంది. కేసీఆర్ కట్టించిన ప్రాజెక్టు కష్టకాలంలో ఆదుకుంటుందని నోటితో కాకున్నా చర్యల ద్వారా ఒప్పుకొన్నది. లక్ష కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని చేసిన తలకుమాసిన ఆరోపణలు తప్పని తేలిపోయింది. పనికిరాదని ముద్రవేయాలనుకున్న ప్రాజెక్టు సకాలంలో ఆదుకుంటున్నది. కేసీఆర్ ముందుచూపు రాష్ట్ర ప్రజలకు రక్షణ దుర్గమైంది. జల సంరక్షణ మార్గమైంది. మరి వృథా ఎక్కడ జరిగింది? బట్టకాల్చి మీదేయాలన్న ప్రయత్నాలు బెడిసికొట్టి కాంగ్రెస్‌కు తలవంపులు తెచ్చింది. రాజకీయాల కోసం ప్రజా ప్రయోజనాలను బలిపెట్టాలనుకుంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించేలా కాంగ్రెస్‌కు ఈ ఉదంతం కనువిప్పు కలిగిస్తే పది వేలు.

రైతన్నను దగా చేసిన కాంగ్రెస్

ఎంతో పద్ధతిగా, తప్పుల్లేకుండా, జాగ్రత్తగా అమలు చేయవలసిన పంట రుణమాఫీని తెలంగాణ ప్రభుత్వం తత్తరబిత్తరగా చేసి రైతన్నలకు పుట్టెడు దుఃఖాన్ని మిగిల్చింది. ఈ తొందరపాటు వెనుక సర్కారీ రైతు ద్రోహం దాగి ఉన్నది. పాలనా పగ్గాలు రేవంత్‌రెడ్డి చేతికొచ్చాక రూ.2 లక్షల పంట రుణమాఫీ అన్నది అన్నట్టుగా చేయడం అసాధ్యమని తెలిసి రైతులను దగా చేసేందుకు కాంగ్రెస్ సిద్ధపడ్డది. వీలైనంత మాఫీ నిధుల తగ్గింపునకు అలా కుట్రలు మొదలయ్యాయి. మాఫీ విధి విధానాలు ఇలా ఉంటాయని ప్రజలకు స్పష్టం చేయకుండానే జీవో విడుదల చేశారు. అందులో 'తెలంగాణలో భూమి కలిగి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రూ.2 లక్షల వరకు పంట రుణ మాఫీ వర్తిస్తుందని ఉన్నది. రైతు కుటుంబాన్ని నిర్ణయించడానికి ఆహారభద్రత కార్డులో ఉన్న సమాచారం ప్రామాణికంగా ఉంటుంది' అని పేర్కొన్నారు.

బి.నర్సన్
9440128169

కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం కిసాన్ మినహాయింపులను రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారం మేరకు పరిగణనలోకి తీసుకోబడుతుంది' అని కూడా ఉంది. నిజానికి పీఎం సమ్మాన్ కిసాన్ నిధి అనేది రైతుబంధు లాంటి పథకం. దానికి రుణమాఫీతో ఎలాంటి సామ్యం లేదు. దాని నిబంధనలు రుణమాఫీకి వర్తింపజేయడం అన్యాయం. రైతు కుటుంబం అనే పదం పీఎం కిసాన్‌లో ఉన్నది. ఇంకా రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, ప్రభుత్వ ఉద్యోగులు, నెలకు రూ.10 వేలు మించి పింఛన్ పొందుతున్నవారు, ఆదాయం పన్ను చెల్లించేవారు, డాక్టర్, లాయర్ లాంటి వృత్తుల్లో ఉన్నవారు పీఎం కిసాన్ సాయానికి అనర్హులు.

పీఎం కిసాన్ లబ్ధి పొందుతున్నవారికే ఈ రుణమాఫీ వర్తిస్తుందని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం బాహాటంగా చెప్పాల్సింది. జీవోలో ఉన్న విషయం సామాన్య రైతులకు ఎలా తెలుస్తుంది? ఇదే విషయాన్ని ఎవరైనా ప్రభుత్వాధికారులు స్పష్టం చేస్తే రైతుల మధ్య గందరగోళం సమసిపోయేది. పీఎం కిసాన్ సమ్మాన్ ద్వారా డబ్బులు వచ్చినవారికే తప్ప మిగతా రైతులకు రుణం మాఫీ కాదని తెలిసే అవకాశం ఉన్నది. అయితే ఇక్కడే ప్రభుత్వం దాపరికాలు పాటిస్తున్నది. బ్యాంకులో రుణం ఉన్న రైతులకు మాఫీ అవుతుందని నిలకడలేని సమాధానంతో కాలం వెళ్లబుచ్చుతున్నది.

ప్రభుత్వం మాట ఒకటి, చేత ఒకటి కావడంతో రైతులు అన్నిరకాలుగా నష్టపోయారు. చక్కగా పంట రుణం రెన్యువల్ చేసుకునే రైతులు కూడా గత రెండేండ్లుగా మాఫీ ఆశపై కాలం గడిపారు. అలా కాలయాపన వల్ల ఏడాది కాలానికి 7 శాతం ఉండే వడ్డీ ఆ తర్వాతి కాలానికి 12.5 శాతానికి పెరిగిపోతుంది. పైగా సకాల చెల్లింపునకు లభించే 5 శాతం వడ్డీ రాయితీని కోల్పోతారు. సాధారణ వడ్డీ పోయి చక్రవడ్డీ లెక్కింపు మొదలుకావడం మరో సమస్య. రెండు పంటల కాలం తర్వాత అప్పు నిరర్థక ఆస్తిగా మారిపోతుంది. కాంగ్రెస్ హామీ ఇలా లక్షలాది రెగ్యులర్ రైతులను డిఫాల్టర్లుగా మార్చేసింది. ఇది బ్యాంకింగ్ వ్యవస్థపై ఎంతో ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుంది. నేతల హామీని నమ్మి బ్యాంకులు ఎందుకు వేచి ఉండాలనే చిక్కు ప్రశ్న మరింత జఠిలమై వసూళ్ల కోసం అవి రైతులపై ఒత్తిడి పెంచే అవకాశం ఉన్నది.

రూ.2 లక్షల రుణమాఫీ హామీని రేవంత్ తొలిసారిగా 2022 మే 6నాడు వరంగల్‌లో జరిగిన 'రైతు సంఘర్షణ' సభలో ప్రస్తావించారు. సభాముఖంగా రైతు డిక్లరేషన్‌ను ప్రకటించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, కౌలు రైతులకు ప్రతి ఎకరానికి రూ.15 వేల ఆర్థిక సాయం అనేవి ఆ డిక్లరేషన్‌లో ప్రధానమైనవి. ఈ మాటలు విన్న ఏ రైతైనా కాంగ్రెస్ గెలిస్తే రూ.2 లక్షల దాకా బ్యాంక్ అప్పు మాఫీ అయితుందని గట్టిగా నమ్ముతాడు. అదే ఆశతో ఓటు గుద్దేశాడు. అలా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పీఎంకిసాన్‌తో పాటు రేషన్ కార్డు నిబంధన తెచ్చి రైతులతో క్రూర పరిహాసమాడుతున్నది. బడ్జెట్ చర్చలో కూడా మాఫీ రాని రైతుల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయలేదు. వ్యవసాయ కేటాయింపులో కౌలు రైతుల ప్రస్తావన లేదు. నిధుల కొరత వల్ల రుణమాఫీ ఇదే విధంగా కొనసాగుతుందని చెప్పకనే చెప్పింది. ఆశపడి మోసపోయిన రైతుల కోసం ప్రభుత్వం వద్ద ఎలాంటి సాంత్వన వాక్యాలు లేవు. నిజానికి మాఫీ రాని రైతులు తమను క్షమించాలని ప్రభుత్వం బహిరంగంగా ఒప్పుకోక తప్పదు.

> ప్రభుత్వం మాఫీ ప్రక్రియ ఆరంభిస్తూ 39 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ కోసం రూ. 31 వేల కోట్లు అవసరమని ప్రకటించింది. ఆ మాట ప్రభుత్వమే మరిచిపోయినట్టుంది. ఎందుకంటే బడ్జెట్ నాటికి ఆ మొత్తం రూ.26 వేల కోట్లకు పడిపోయింది. మాఫీ విధి విధానాలు ఇలాగే ఉంటే అందులో సగమైనా సరిపోతుంది.

మొదటి విడతగా లక్ష రుణం ఉన్న 11.32 లక్షల రైతు కుటుంబాలకు రూ.6098 కోట్లు విడుదలయ్యాయి. ఈ లెక్కన రాష్ట్రంలో లక్షకు పైగా బ్యాంకు ఋణం తీసుకున్నవారు 27 లక్షలుండే అవకాశం లేదు. వారి అప్పు మొత్తం రూ. 24 వేల కోట్లు కానేకాదు. వాస్తవానికి బ్యాంకుల్లో లక్షకు పైగా అప్పు తీసుకునే వారి సంఖ్య తక్కువగా ఉంటుంది. లక్ష మాఫీ విషయంలో ప్రభుత్వం పాటించిన విధానాలు పోల్చిచూస్తే రూ.10-15 వేల కోట్లు ఇందుకు సరిపోతాయి. ఎందుకంటే భూమి ఎక్కువగా ఉన్నవారు తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండకపోవచ్చు. వారు ఉద్యోగాల్లో ఉండవచ్చు. ఆదాయ పన్ను పరిధిలోకి రావచ్చు. అందులో పీఎం సమ్మాన్ కత్తికి బలయ్యే వారే ఎక్కువ. త్వరలో ప్రకటించే లక్షకుపై రుణమాఫీతో కాంగ్రెస్ లెక్కల బండారం మరింత బయటపడుతుంది.

ఉద్యోగ సంఘాల చీలికే సమస్య

రాష్ట్రంలోని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకుల్లో ఐకమత్యం లోపించింది. కుల, మత, ప్రాంతాల వారీగా ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం మొత్తం ఉపాధ్యాయుల ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సమైక్యాంధ్ర ఉపాధ్యాయులు ఒకవైపు, తెలంగాణ రాష్ట్రం కోరుకునే ఉపాధ్యాయులు మరోవైపు రెండు సంఘాలుగా విడిపోయారు. తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల్లో రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులుగా పనిచేస్తున్నవారు జీవితకాలం తామే ఉండాలని కోరుకుంటున్నారు. 'మీరు ఎన్నికై దశాబ్దకాలం గడిచింది? ఇంకెంతకాలం మీరు కొనసాగుతారు?' అని ఎవరైనా ప్రశ్నిస్తే వారిని వ్యక్తిగతంగా టార్గెట్ చేసి వేధింపులకు పాల్పడుతున్నారు.

డాక్టర్ ఎస్.విజయభాస్కర్
92908 26988

ప్రతి సంఘం నుంచి మూడు, నాలుగు సంఘాలు విడిపోయాయి. ఉదాహరణకు గతంలో ఎస్టీయూ సంఘం ఉండేది. ఎస్టీయూ నుంచి యూటీఎఫ్, డీటీఎఫ్, ఏపీటీఎఫ్‌లుగా ఏర్పడ్డాయి. పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా అన్ని అవకాశాలు కల్పించాలని, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులైనా, ప్రభుత్వ ఉపాధ్యాయులైనా డీఎస్సీ ద్వారానే ఉద్యోగానికి ఎంపిక అవుతున్నారని, కామన్ సీనియారిటీ కావాలనే పంచాయతీ రాజ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ) ప్రస్తుత పేరు ప్రోగ్రెసివ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ). తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో తెలంగాణ పీఆర్టీయూగా తర్వాత పీఆర్టీయూ తెలంగాణగా నాలుగు రకాల పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘాలున్నాయి. ఈ విధంగా ఎన్నో ఉపాధ్యాయ సంఘాలు ఉండటం వల్ల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావడం లేదు.

గతంలో ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు ఏదైనా పిలుపునిస్తే అధికార పార్టీ నేతలు వెంటనే పరిష్కరించేవారు. నాటి నాయకులకు ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) మీద, ఆంధ్రప్రదేశ్ స్టేట్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ మీద మంచి పట్టు ఉండేది. నేటి నాయకులకు డబ్బు యావ తప్ప, కనీస అవగాహన కూడా ఉండటం లేదు. దాదాపుగా రాష్ట్రంలో 58 ఉపాధ్యాయ సంఘాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఏడు సంఘాలకు ఓడీ సౌకర్యం కల్పిస్తే దానిలో ఐదు ఉపాధ్యాయ సంఘాలే ఉన్నాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు నాయకత్వం వహించే నాయకులు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను ఏకతాటిమీదకు తెచ్చి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఉద్యోగ, ఉపాధ్యాయుల పే రివిజన్ కమిటీ (పీఆర్సీ) గడువు ముగిసి ఏడాది గడిచినా అడిగే నాథుడే లేడు. ఐదు, ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నా నాయకుల్లో ఉలుకు లేదు, పలుకు లేదు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు నగదు రహిత ఆరోగ్య కార్డులను పంపిణీ చేస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం వాటిని పెండింగ్‌లో పెట్టింది. అయినా ఏ నాయకుడూ అడగడం లేదు.

> **ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం దయతలచి ఎప్పుడో పదోన్నతులు, బదిలీలు చేస్తే అప్పుడు వారు సాధించిన విజయంగా గొప్పగా చెప్పుకొని క్షీరాభిషేకాలు చేస్తుండటం సిగ్గుచేటు. 317 జీవో, స్పౌజ్ కేసులలోనూ అంతే నిర్లక్ష్యం కనపడుతున్నది. అయినా ఏ నాయకుడూ పట్టించుకోడు.**

హైదరాబాద్ ఫ్రీ జోన్‌గా ఉండేది. సమైకాంధ్రలో హైదరాబాద్‌ను వేరుగా, 7వ జోన్‌గా హైదరాబాద్ లోకల్ ప్రజలకు ప్రాధాన్యం ఉండేది. ఇప్పుడు చార్మినార్ జోన్ అంటూ 4వ జోన్‌లో రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, మహబూబ్‌నగర్, వనపర్తిలతో హైదరాబాద్‌ను కలిపినా అడిగే ధైర్యం ఉద్యోగ, ఉపాధ్యాయులకు లేదు. హెచ్ఆర్ఏ 30 శాతం నుంచి నగరాలలో 24 శాతంగా చేసి 6 శాతం బేసిక్ పే నుంచి తీసివేసినా ఏ నాయకుడూ పట్టించుకోవడం లేదు.

రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులకు ప్రభుత్వమే ఎన్నికలు నిర్వహించాలి. నగదు రహిత ఆరోగ్య కార్డులను జారీచేయాలని తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల్లోని ఉద్యోగ, ఉపాధ్యాయులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. భర్త ఒక చోట, భార్య మరో చోట, వారి పిల్లలు ఒక చోట, ఉంటూ మానసిక క్షోభను అనుభవిస్తున్న స్పౌజ్ కేసులను మానవత్వంతో పరిష్కరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు కోరుతున్నారు. కాబట్టి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నది.



చర్చలను ప్రజలకు తెలియనియ్యరా?

ప్రజల సభ నుంచి పాత్రికేయులను ఎలా వెళ్ల గొడతారు? పార్లమెంట్ సమావేశాలను రిపోర్ట్ చేయకుండా జర్నలిస్టులను తొలగించడం పౌరుల హక్కులపై దాడి చేయడమే. ఇది పూర్తిగా ఆమోదయోగ్యం కాదు. వెంటనే దీన్ని ఉపసంహరించుకోవాలి.

- సాగరికా ఘోష్, టీఎంసీ ఎంపీ, జర్నలిస్ట్

భారత రాజ్యాంగంలో పొందుపరిచిన నిబంధనల మేరకు ఎస్సీ, ఎస్టీల జనగణన చేసి, వారికి వారి జనాభా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలి. కాబట్టే 1947 నుంచి ఎస్సీలు, 1950 నుంచి ఎస్టీలు రిజర్వేషన్ ఫలాలు పొందుతున్నారు. 1953-1955 మధ్య కాకా కాలేల్కర్ నివేదిక ప్రకారం.. దేశంలో 2,399 ఓబీసీ కులాలున్నాయి. అందులో 837 కులాలు అత్యంత వెనుకబడి ఉన్నాయి. కాలేల్కర్ కమిషన్ స్త్రీలను కూడా ఓబీసీలుగా పరిగణించాలని చెప్పింది.

కులగణన ఎందుకు చేయరు?

డాక్టర్ కావలి చెన్నయ్య ముదిరాజ్
90004 81768

1979, జనవరి 1న ప్రధాని మొరార్జీ దేశాయ్ జనతా పార్టీ ప్రభుత్వం సామాజికంగా, ఆర్థికంగా, వెనుకబడిన తరగతుల కోసం (2వ కమిషన్) బీహార్ మాజీ ముఖ్యమంత్రి, అప్పటి ఎంపీ బిందేశ్వర్ ప్రసాద్ మండల్ నేతృత్వంలో కమిషన్ వేసింది. దీన్నే మండల్ కమిషన్ అంటారు. 1980 డిసెంబర్ 31న ఈ కమిషన్ నివేదిక సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం.. దేశంలో ఓబీసీలు 52 శాతంపై మాటే. వీరికి విద్య, ఉద్యోగరంగాల్లో 27 శాతం రిజర్వేషన్ కల్పించాలని సిఫారసు చేసింది. కానీ కమిషన్ వేసిన జనతా పార్టీ ప్రభుత్వం అధికారం కోల్పోయింది. మండల్ కమిషన్ సిఫారసులకు వ్యతిరేకంగా ఉన్నతవర్గాల వారు దేశవ్యాప్త ఉద్యమాలు చేశారు. దీన్ని మండల్ వర్సెస్ కమండల్ ఉద్యమం అంటారు. తర్వాత వచ్చిన ఇందిరాగాంధీ ప్రభుత్వం, రాజీవ్ గాంధీ ప్రభుత్వం మండల్ కమిషన్ నివేదికను పక్కనపెట్టారు. 1990 ఆగస్టులో వీపీ సింగ్ ప్రభుత్వం మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తున్నట్టు ప్రకటించింది. ఎట్టకేలకు 1992 నుంచి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే సంస్థల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ అమలుపరచడం మొదలైంది. కొన్ని జాతీయ ప్రాముఖ్యం కలిగిన సంస్థలు నేటికీ ఓబీసీలకు రిజర్వేషన్లు అమలుచేయడం లేదు. 2011-12లో కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక, రాజకీయ, ఆర్థిక, కులగణన చేసింది, కానీ వివరాలు ఇప్పటి వరకు బయటకు రాలేదు. 2018లో బీజేపీ ప్రభుత్వ హోం మినిస్టర్ రాజ్‌నాథ్‌సింగ్ కులగణన చేపడతామన్నారు. కానీ, నేటికీ అది కలగానే మిగిలిపోయింది. విశేషమేమంటే ఇదే బీజేపీ ప్రభుత్వం కులగణన చేయడం కుదరదని 2021 సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టుకు తెలియజేసింది. 2022లో ఉదయపూర్‌లో జరిగిన సమావేశంలో కుల గణనకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకున్నది. సమాజ్‌వాదీ పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్, జనతాదళ్ యునైటెడ్, డీఎంకే, వైసీపీ, టీడీపీ, బీఎస్పీ, బీఆర్ఎస్ మొదలగు పార్టీలు కులగణనను సమర్థిస్తున్నాయి. బీజేపీ, కొన్ని పార్టీలు మాత్రం వ్యతిరేకిస్తున్నాయి. కులగణన చేయకుండా ప్రభుత్వ పథకాలు కావచ్చు, చట్టసభల సభ్యత్వం కావచ్చు, ఉన్నత ఉద్యోగాలు కావచ్చు అందరికీ చేరుతాయని అనడం నమ్మశక్యం కాదు.

నేడు దేశంలో ఆర్థిక, సామాజిక రాజకీయాలు మొత్తం కులం చుట్టే తిరుగుతున్నాయి. కులంలో నిగూఢంగా దాగి ఉండే సామాజిక హోదా, గౌరవ మర్యాదలు, అధిపత్యం, ఆధిక్యత, అణచివేత, పేదరికం మొదలైనవన్నీ ప్రభావం చూపుతున్నాయి. కులాన్ని రోజురోజుకు బలపరుస్తూ ప్రతిరంగాన్ని శాసిస్తున్నాయి. 1990 నుంచి మండల్ కమిషన్ నివేదిక అమలు పరుస్తామని ప్రకటించడం, ఆ తర్వాత వచ్చిన లిబరలైజేషన్, గ్లోబలైజేషన్, ప్రైవేటైజేషన్ లాంటి ఆర్థిక సరళీకరణలు మనిషి అస్తిత్వాన్ని చాలా మార్పులకు గురిచేశాయి. మండల్ కమిషన్ నివేదిక ప్రకారం దేశంలో 3,743కు పైగా కులాలు ఓబీసీ జాబితాలో ఉన్నాయి. కానీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఓబీసీ రిజర్వేషన్ల ప్రకారం 2,479 కులాలు మాత్రమే నమోదు చేయబడ్డాయి. అంటే ఇంకా వివిధ రాష్ట్రాల్లో ఓబీసీలకు కల్పిస్తున్న రిజర్వేషన్ల పట్టికలోని కులాలు 3,150. కేంద్రం 3,743 ఓబీసీ కులాలకు, వివిధ రాష్ట్రాలు 3,150 బీసీ కులాలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నాయి. ఇంకా 1,260 బీసీ కులాలకు రాష్ట్రాలు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాల్సి ఉన్నది. కులగణన చేయడం వల్ల ఏ కులంలో ఎందరు ఉన్నారు కచ్చితమైన లెక్క తెలుసుకొని వారివారి జనాభాకనుగుణంగా రిజర్వేషన్ ఫలాలు, ప్రభుత్వ పథకాలు దక్కేటట్లు చూడవచ్చు. సామాజిక అసమానతలను దూరం చేయడానికి, అట్టడుగు వర్గాలను ఉద్ధరించడానికి, వనరుల పంపిణీ సక్రమంగా జరగడానికి, కులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులను తెలుసుకొని వారిపై దృష్టి కేంద్రీకరించి వారిని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లవచ్చు. స్థిరనివాసం లేకుండా సంచార జీవితం గడిపే కులాల లెక్కలు సేకరించి జనజీవన స్రవంతిలో కలిసేటట్లు చేయవచ్చు.

> **కులాలను లెక్కించడం వల్ల ప్రతి కులం జనాభా ఎంతనేది తెలుస్తుంది. అప్పుడు తక్కువ జనాభా ఉన్న ఉన్నతవర్గాలు ఎక్కువ జనాభా కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలను పాలిస్తున్నట్టు యావత్తు ప్రపంచానికి తెలిసిపోతుంది. ఆర్థిక, రాజకీయ, పారిశ్రామిక, చలనచిత్ర, సేవల, విద్య, ఉపాధిరంగాలపై ఉన్న ఉన్నతవర్గాల ఆధిపత్యం బట్టబయలైపోతుంది.**

ఈ మధ్యనే బీహార్‌లోని నితీష్‌కుమార్ ప్రభుత్వం రాష్ట్రమంతా సమగ్ర కులగణన చేసి ఎస్సీ ఎస్టీ, బీసీలకు ఇస్తున్న 50 శాతం రిజర్వేషన్‌ను రాష్ట్ర చట్టసభలో బిల్ పాస్ చేసి 65 శాతానికి పెంచింది. కానీ పాట్నా హైకోర్టు రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదని పెంచిన రిజర్వేషన్లు కొట్టి వేసింది. కేంద్రం 2019లో తాను అనుకున్న వెంటనే అగ్రవర్ణ పేదలకు (ఈడబ్ల్యూఎస్) 10 శాతం రిజర్వేషన్ కల్పించింది. వీరికి రిజర్వేషన్ కల్పించడానికి శాస్త్రీయంగా జనాభా లెక్కలు చేయలేదు మరి ఏ ప్రాతిపదికను 10 శాతం రిజర్వేషన్ కల్పించినట్టు? వీరికి కల్పించిన రిజర్వేషన్‌లో 50 శాతం పరిమితి దాటట్లేదా? దీన్ని గౌరవ సర్వోన్నత న్యాయస్థానం ఏ ప్రాతిపదిక సమర్థించిందో తెలిస్తే బాగుండేది.

మన దేశంలో సకల సంపదల ఉత్పత్తికి చెమటోడ